# సిపిఐ(ఎం)కు ఓటెయ్యండి

**వామపక్షాల్ని బలపర్చండి**

# అవినీతి రహిత భారతదేశ నిర్మాణం కోసం

16వ లోక్‌సభ ఎన్నికల ప్రచార కరపత్రం 2014

**యూ**పీఏ, ప్రధాన ప్రతిపక్షం బీజేపీ రెండూ పీకలలోతు అవినీతిలో కూరుకు పోయాయి. ఏదో ఒక స్కాము బయట పడని రోజు లేదు. ఉన్నత స్థానాల్లోని రాజకీయ నాయకులకు అధికారులకు లంచాలు మేపి కుదుర్చుకున్న ఏదో ఒక ఒప్పందం వెలుగు చూడకుండా దినం గడవటం లేదు. నయా ఉదారవాద విధానాలు సృష్టించిన ఈ వ్యవస్థలో బడా కార్పొరేట్లు, పొలిటీషియన్లు, బ్యూరోక్రాట్ల దుష్టత్రయం ఇప్పుడు ఒక అంతర్భాగంగా మారిపోయింది.

సరిగ్గా ఈ నయా ఉదారవాద విధానాల చట్రాన్ని బలోపేతం చేయడానికి కాంగ్రెస్ బీజేపీలు రెండూ కంకణం కట్టుకున్నాయి. జనాభాలో భారీ సంఖ్యాకులు ఎదుగూబొదుగూ లేని అభద్రతాపూరితమైన జీవన ప్రమాణాలతో అల్లాడుతుంటే మరోవంక కొన్ని కార్పొరేట్ సంస్థలు, ధనిక వ్యక్తులు ఏకంగా గ్లోబల్ వెల్త్ జాబితాల్లోకి చేరిపోయేంత అన్యాయపూరిత ప్రభావాన్ని ఈ ఆర్థిక వృద్ధి కలుగజేస్తోందంటే అందుకు ఇదీ ఒక కారణం.

ఈ దేశాన్ని ఈ దేశ సంపదను అడ్డంగా దోచేసే దుర్మార్గపు చర్యకు ఈ దుష్టత్రయమే ముందుండి నాయకత్వం వహించింది.

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ–2 ప్రభుత్వం అత్యంత అవినీతిపూరిత పాలనావ్యవస్థగా చరిత్రలో నిలిచిపోతుంది. 2జి స్కాం, బొగ్గు స్కాం, గ్యాస్ ధరల స్కాం, కామన్‌వెల్త్ క్రీడల స్కాం, ఐపీఎల్ స్కాం, హెలికాప్టర్ కొనుగోళ్ల స్కాం... చెప్పుకుంటూ పోతే ఇలా ఎన్ని స్కాములో...! రోల్స్ రాయిస్ కంపెనీ తన జెట్ ఇంజన్ల విక్రయ ఒప్పందం కుదుర్చుకోడానికి చెల్లించిన కమీషన్ల బాగోతం యావద్దేశం ఎన్నికలకు సన్నద్ధమవుతున్న ఈ తరుణంలో కొత్తగా వెలుగు చూసింది. అదే సమయంలో బీజేపీ, ప్రత్యేకించి గుజరాత్ తరహా ప్రభుత్వం భూములను వనరులను ఖజానాకు తూట్లు పొడిచి దోపిడీ చేసిన వైనం

తెలిసిందే. దీని మూలాలు నయా ఉదారవాద విధానాలలోనే ఉన్నాయి. కర్నాటకలో మైనింగ్ మాఫియా పునరాగమనంతో పాటు ఆ రాష్ట్ర కళంకిత మాజీ ముఖ్యమంత్రి తిరిగి బీజేపీ గూటికి చేరడం గమనిస్తే, అవినీతికి సంబంధించి నంతవరకు యూపీఏకు బీజేపీకి తేడా ఏమీ లేదు.

## సురక్షిత ప్రాంతాల్లో నల్లధనం

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అక్రమ లావాదేవీల వల్ల దేశం దాటిపోయిన మొత్తం 20.92 లక్షల కోట్ల రూపాయలని 2011లో ప్రభుత్వం ఒక ప్రశ్నకు రాజ్యసభలో సమాధానం ఇచ్చింది. పన్ను ఎగవేత, అవినీతి, లంచాలు, నేరపూరిత కార్యకలాపాలు.. వీటన్నిటి నుంచి ఈ మొత్తం ఉత్పత్తి అయ్యిందని వివరించింది. ఇందులో 9.64 లక్షల కోట్లు 1948 నుంచి 2008 మధ్య కాలంలో తరలిపోగా, మిగిలిన 11.28 లక్షల కోట్లు 2008–2010 మధ్య నష్టపోయాం! మరో మాటలో చెప్పాలంటే, 60 ఏళ్ల అవినీతి కంటే కేవలం రెండేళ్లలో జరిగిన అవినీతి ఎక్కువగా ఉంది.

అయినప్పటికీ ఈ డబ్బు వెనక్కు తీసుకురావడానికి ప్రభుత్వాలు ఎలాంటి సీరియస్ చర్యలూ చేపట్టలేదు. అందుకు భిన్నంగా నేరగాళ్ల పేర్లను దాచిపెట్టి వారిని రక్షించడానికి యూపీఏ ప్రయత్నించింది. ఎల్లలు దాటిన సొమ్మును వెనక్కు రప్పించడానికి ఎన్‌డీఏ సైతం తన హయాంలో ఎలాంటి కృషీ చేయలేదు. తద్భిన్నంగా పన్ను ఎగవేతను, హవాలా లావాదేవీలను చట్టబద్ధంగా మార్చేసేందుకు ద్వంద్వపన్నుల నివారణ పేరిట క్రూరమైన విధానాలు ప్రవేశపెట్టింది.

## 20.92 లక్షల కోట్లంటే...

- 2014–2015 మధ్యంతర బడ్జెట్‌లోని మొత్తం ప్రణాళికేతర వ్యయానికి సమానం. ఈ ఏడాది కాలంలో చాలా వరకు సంక్షేమ కార్యక్రమాలకు, స్కీములకు, ప్రభుత్వం పనిచేయడానికి అవసరమయ్యేన్ని నిధులు ఈ ప్రణాళికేతర వ్యయం నుంచే కేటాయిస్తారు.

- మన దేశం విదేశీ ప్రభుత్వాల నుంచి, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్ వంటి ఏజెన్సీల నుంచి తీసుకున్న రుణానికి ఇది రెండు రెట్లు

## అక్రమ నిధులను ప్రజోపయోగానికి వినియోగిస్తే, కేటాయింపులు భారీగా పెంచవచ్చు:

- విద్యకు 14 రెట్లకు పైగా కేటాయింపు
- ఆరోగ్యానికి 31 రెట్లకు పైగా కేటాయించవచ్చు
- దళితులు, ఆదివాసీలు, ఇంకా ఇతర అత్యంత వెనుకబడిన తరగతుల సంక్షేమానికి 14 రెట్లకు పైగా కేటాయించే వీలు
- అందరికీ ఆహారం సమకూర్చి ఆకలిని తరిమికొట్టవచ్చు
- తగ్గింపు చార్జీలతో అందరికీ విద్యుత్తు, బాగా వెనుకబడిన ప్రాంతాల రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వగలం
- అందరికీ ఉద్యోగాలు లభించేలా అనేక కొత్త పరిశ్రమలు ప్రారంభించవచ్చు

## ప్రభుత్వ వనరులు - ప్రయివేటు లాభాలు

ప్రయివేటు రంగానికి ప్రభుత్వ వనరులను సహజ వనరులను అప్పగించే నయా ఉదారవాద విధానాల్లోనే అవినీతి వేరూనుకుని ఉంది. దేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు లబ్ధి చేకూర్చే గ్యాస్ ధరల విధానాన్ని ఇందుకు ప్రధాన ఉదాహరణగా తీసుకోవచ్చు. 2007 నుంచి ఈ అంశాన్ని వామపక్షాలు లేవనెత్తుతూనే ఉన్నాయి. రాజ్యాంగంలోని 287 (1) ప్రకారం అన్ని భూములు, ఖనిజాలు, భారత ప్రాదేశిక జలాల పరిధిలోని సముద్రాల అంతర్భాగంలోని నిధులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండాలి. కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసమే వినియోగించాలి. కాబట్టి వాటి సహజ స్థితిలో ఉన్న అన్ని పెట్రోలియం ఉత్పత్తులపై యాజమాన్య హక్కులు భారత

యూనియన్‌కే ఉంటాయి. అంటే దేశ ప్రజల చేతిలో ఉంటాయి. అలాగే రాజ్యాంగంలోని 39 (బి) అధికరణం ప్రకారం, సమాజపు భౌతిక వనరులపై యాజమాన్యం, వాటిపై అదుపు హక్కుల పంపిణీ సమిష్టి శ్రేయస్సు కోసం ఉపయోగపడేలా జరగాలి. ఈ రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి, కేజీ బేసిన్ సహజవాయు నిక్షేపాలు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందినవి అన్నట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రవర్తిస్తూ రిలయన్స్ ప్రయోజనాలు నెరవేర్చేలా వ్యవహరిస్తోంది. బీజేపీ కూడా ఈ విధానంతో ఏకీభవిస్తోంది. కాబట్టే అది ఈ అంశంపై నోరు మెదపడం లేదు.

గ్యాస్ ఉత్పత్తి వ్యయం 'ఎంబిటియు'కి దాదాపు ఒక డాలర్ అని రిలయన్స్ సుప్రీంకోర్టులో అంగీకరించింది. అయినప్పటికీ ఆ కంపెనీ పొందుతున్న ధర నాలుగు డాలర్లు పైనే. ఇప్పుడు ప్రభుత్వం దాన్ని ఎనిమిది డాలర్ల కంటే ఎక్కువకు పెంచడానికి అంగీకరించింది. ఈ నిర్ణయం రిలయన్స్‌కు గాలివాటం లాభాలను మూటగట్టి పెడుతుంది. అంతిమ ఫలితం: విద్యుత్ ఛార్జీలు, ఎరువుల ధరలు, ఇంకా ఎన్నో వాటి ధరలు పెరిగిపోతాయి.

ప్రభుత్వం గనుక ఉత్పత్తి వ్యయానికి దాదాపు రెండున్నర రెట్లు అధికంగా 2.34 డాలర్ల ధరకు గ్యాస్ కొనుగోలు చేసిందనుకున్నా, ఎటువంటి నష్టం లేకుండా, కేజీ బేసిన్ ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ఇళ్లకు 100 రూపాయలకు వంట గ్యాస్, రాష్ట్రం అంతటా రైతాంగానికి ఉచిత విద్యుత్తు ఇవ్వగలిగి ఉండేది. కాని కాంగ్రెస్‌కు దేశం కంటే, దేశ ప్రయోజనాల కంటే రిలయన్స్ ఇంకా ఇతర కార్పొరేట్ సంస్థలే ముఖ్యం.

బీజేపీదీ ఇదే బాట. బీజేపీ పాలనలో కర్నాటకలో బళ్లారి 'రెడ్డీ బ్రదర్స్'కు ఖనిజాలను అప్పగించారు. వారు రోజుకు 17 కోట్ల రూపాయల వంతున లాభాలు గడించారని లోకాయుక్త నివేదించింది. కొన్ని వేల కోట్ల రూపాయల సహజ వనరుల దోపిడీ జరిగింది.

## మోడీ స్టైల్ అవినీతి

క్రోనీ క్యాపిటలిజంను ప్రోత్సహించే నయా ఉదారవాద విధానాల మోడల్‌కు మోడీ గుజరాత్ అత్యుత్తమ ఉదాహరణ. వారు ఎన్ని గొప్పలు చెప్పుకున్నప్పటికీ, ఎన్నో

ఏళ్లుగా లోకాయుక్త లేని రాష్ట్రం గుజరాత్. ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ఎందుకంటే, గుజరాత్‌లో ఎన్నో చీకటి ఒప్పందాలు ప్రాణం పోసుకున్నాయి. రైతుల నుంచి కారుచౌక ధరలకు అక్కడ భూసేకరణ జరిగింది. దాన్ని కోటీశ్వరులకు అప్పగించారు. ఈ కార్పొరేట్లు తిరిగి ఆ భూమిని ఇతరులకు అమ్మేసుకుని పెద్దపెట్టున లాభాలు సంపాదించాయి. 'వైబ్రాంట్ గుజరాత్'లో చోటు చేసుకున్న ఈ దోపిడీ బాగోతం అదానీకి చెందింది. 2002 లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు అదానీ సంపద విలువ రూ. 2816 కోట్లు. మోడీ ప్రాపకంలో అదానీ సంపద ఏకంగా రు.35,881 కోట్లకు చేరింది.

## ముంద్రా పోర్టు, సెజ్ : అదానీకి సాయం చేసేందుకు 10వేల కోట్ల నష్టం

పలుకుబడి కలిగిన అదానీ గ్రూపు ముంద్రా పోర్టు, ముంద్రా స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లు ఏర్పాటు చేసేందుకు 2003–04లో 6700 హెక్టార్లు కేటాయించబడింది. రైతుల నుంచి వేలాది ఎకరాల భూకమతాలను సేకరించి వాటిని గుజరాత్ ప్రభుత్వం టోకుగా అదానీలకు అప్పగించింది. చదరపు మీటరు కనిష్టంగా 1 రూపాయి, గరిష్టంగా 32 రూపాయలు వంతున రేటు వసూలు చేసి అప్పగించారు (ఎక్కువ భూమికి చదరపు మీటరుకు 10 రూపాయల ధరకు కట్టబెట్టారు). ఏమైనప్పటికీ, ఈ గ్రూపు, రోడ్లు అభివృద్ధి చేసిన తర్వాత ప్లాట్ల కింద విడగొట్టి వేల రూపాలయల కళ్లు చెదిరే ధరలు పెట్టి ఇతర సంస్థలకు అమ్మేసింది. (ఇలా కొనుక్కున్న వాటిలో ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ఉన్నాయి). అంతిమంగా ప్రభుత్వ ఖజానాకు వాటిల్లిన నష్టం రూ.10,000 కోట్లు వరకు ఉంటుందని లెక్క తేలింది.

## అదానీ పవర్ లిమిటెడ్ : అదానీకి మరో కానుక

గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం అదానీ గ్రూపు నుంచి విద్యుత్తు కొనడానికి అన్ని నిబంధనలూ పక్కన బెట్టింది. దాని వల్ల సామాన్య మానవుడి మీద అదనపు చార్జీల

భారం పడుతుందని తెలిసి కూడా ఈ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుంది. 2006లో, గుజరాత్  విద్యుత్ కొరత ఎదుర్కొంటున్నప్పుడు, రాష్ట్రంలో 3000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి గుజరాత్ ఉర్జా వికాస్ నిగమ్ లిమిటెడ్ (జియువిఎన్ఎల్) ప్రయివేటు కంపెనీలను ఆహ్వానించాలని నిర్ణయించింది.  అందులో భాగంగా అదానీ గ్రూపు 1000 మెగావాట్ల కెపాసిటీతో రెండు ప్లాంట్లు పెట్టడానికి ముందుకొచ్చింది. అందుకు అంగీకరించిన జియూవీఎన్ఎల్ అదానీ గ్రూపుతో రెండు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏలు) కుదుర్చుకుంది. వీటి ప్రకారం, యూనిట్‌కు రూ. 2.89, రూ. 2.35 చెల్లించాలి. అయితే, అదానీ ఒప్పందాలకు కొద్దిగా ముందు ఈ ప్రభుత్వ సంస్థ కోస్టల్ గుజరాత్ పవర్ ప్రాజెక్ట్ అనే మరో కంపెనీతో యూనిట్‌కు రూ. 2.26 రేటు చెల్లిస్తానని, అంటే యూనిట్‌కు 63 పైసలు తక్కువకు అన్న మాట, ఒప్పందం చేసుకుంది. ఇక్కడ చిన్న లెక్క వేస్తే అదానీ ఒప్పందాల వల్ల ప్రభుత్వానికి ఎంత నష్టం వాటిల్లిందో అదానీకి ఎంత లాభం చేకూరిందో తెలిసిపోతుంది. అదానీ పవర్  2011లో 7000 మిలియన్ యూనిట్లు, 2012లో 14,393 యూనిట్ల విద్యుత్తు సరఫరా చేసింది. జియూవీఎన్ఎల్ ఆ రెండేళ్లకు గాను వరుసగా రూ. 441 కోట్లు, రూ. 906 కోట్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. మరో విధంగా చెప్పాలంటే అదానీ గ్రూపునకు అదనంగా రూ.1437 కోట్లు లబ్ధి చేకూరింది. మరో వంక, సామాన్య వినియోగదారులు, రైతులు, సామాన్యుడు తాము చెల్లించాల్సిన దానికంటే ఆ మేరకు ఎక్కువ చెల్లించాల్సి వచ్చింది.

## కార్పొరేట్ల స్థావరంలో ప్రేమపూర్వక ఒప్పందాలు

టాటా టెలీకమ్యూనికేషన్స్‌తో పాటు 2జీ స్కాంలో ఇరుక్కున్న ఎస్సార్ గ్రూప్ కంపెనీలతో కూడా మోడీ ఒక ప్రేమపూర్వక ఒప్పందం కుదుర్చుకున్నాడు. వాటికి 2,07,60,000 చదరపు మీటర్ల భూమిని ప్రసాదించాడు. ఇందులో కొంత భాగం తీరప్రాంత నియంత్రణ మండలి పరిధిలోకి వస్తుంది. దీనిలో అటవీ భూమి కూడా ఉంది. ఈ జోన్లలో ఎలాంటి అభివృద్ధి చేపట్టరాదంటూ సుప్రీం కోర్టు నిషేధం  విధించింది. భూమి కేటాయింపు జరిగినప్పుడు అటవీ శాఖ డిప్యూటీ కన్జర్వేటర్ ఒక ఫిర్యాదు చేశాడు. భారత అటవుల చట్టం, 1927 కింద శిక్షించదగిన ఉల్లంఘనగా 'ఫారెస్ట్ అఫెన్స్ సిఆర్–11 నంబర్–2

(2006)' పేరిట ఈ ఫిర్యాదు వెళ్ళింది. అలాంటి నాలుగు వేర్వేరు ఉల్లంఘనలు నమోదయ్యాయి. కాని బీజేపీ ప్రభుత్వం అవన్నీ రూ.20 లక్షల జరిమానాల చెల్లింపుతో పరిష్కారం అయ్యాయనిపించింది. ఈ అటవీభూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలన్న, భూమిని అటవీ శాఖకు అప్పగించాలన్న ఆదేశాలను రాష్ట్ర యంత్రాంగం అమలు చేయలేదు. ఎస్సార్ ఈ కబ్జా భూమిని అనుభవిస్తూనే ఉంది. దీని మార్కెట్ ధర చదరపు మీటర్‌కు రూ. 3000 పైగానే ఉంటుంది. ఈ రేటు ప్రకారం భూమి మొత్తం విలువ రూ. 6,228 కోట్లు అవుతుంది. ఇది ప్రభుత్వానికి కలిగిన ధన నష్టం.పర్యావరణానికి కలిగిన నష్టానికి ఇది అదనం.

టాటాలను పశ్చిమ బెంగాల్ నుంచి రప్పించడానికి మోడీ రు.33,000 కోట్ల రాయితీలు ఇచ్చాడని అంచనా. వీటికి అదనంగా, నానో ప్లాంటు  కోసం పొరుగున ఉన్న రైతుల సాగు భూములను ఎండగట్టి మరీ భూగర్భ జలవనరులు వాడుకునేందుకు అనుమతి ఇచ్చాడు.

మరో సందర్భంలో, సూరత్‌లోని 108 ఏళ్ల పురాతనమైన నవసారి అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన విలువైన భూములను ఛాత్రాలా ఇండియా హోటల్ గ్రూప్‌కు ఏడు నక్షత్రాల హోటల్ కట్టేందుకు గుజరాత్ ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమికి కట్టిన విలువ చదరపు మీటరుకు కేవలం రూ.15,000 మాత్రమే. దీని మార్కెట్ ధర చదరపు మీటరుకు రూ. లక్ష పైనే ఉంటుంది. ఏమైనప్పటికీ, ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్ళింది. దాంతో ప్రభుత్వం చదరపు మీటరు రేటును మొక్కుబడిగా రూ.35,000కు పెంచింది. ఈ భూబాగోతంలో ప్రభుత్వం వందల కోట్ల రూపాయల ప్రజాధనం నష్టపోయింది.

ఇక, లార్సెన్ & టూబ్రో (ఎల్&టి) కి హజీరా, సూరత్ ఇండస్ట్రియల్ జోన్‌లోని విలువైన 8,00,000 చదరపు మీటర్ల భూమిని నామమాత్రంగా చదరపు మీటరుకు 1రూపాయి రేటు గట్టి అప్పగించింది. ఈ భూమి వాస్తవ ధర చదరపు మీటరుకు ఎంతలేదన్నా రూ. 3,500 ఉంటుంది. దీన్ని బట్టి ప్రభుత్వ ఖజానాకు ఎంత భారీ నష్టం వాటిల్లిందో ఊహించుకోవచ్చు.

సమాచార హక్కు చట్టం కింద ఆరా తీయగా రూ. 1,700 కోట్ల సుజలాం సుఫలాం యోజన (ఎస్ఎస్వై) స్కీము స్కాం (2009) వెలుగు చూసింది. ఇక 2003లో ఉత్తర గుజరాత్‌లో సేద్యానికి నీటి సరఫరాకు రూ. 6,237.33 కోట్లను సమకూర్చుతామని మోడి ప్రకటించాడు. ఇందులో రూ. 2,063 కోట్ల పనిని రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన గుజరాత్ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అప్పగించారు. ఇది డిసెంబర్ 2005 నాటికి పూర్తి కావల్సి ఉంది. 2008 వరకు రూ. 1,127.64 కోట్లు వ్యయం అయ్యాయి. ప్రభుత్వ వ్యయాలను పర్యవేక్షించే ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) తన నివేదికలో ప్రస్తావించిన దాని ప్రకారం, ఈ స్కీము అమలులో భారీగా అవినీతి చోటు చేసుకుంది, కనీసం రూ. 500 కోట్లు గల్లంతయ్యాయి.

బీజేపీ ప్రభుత్వం ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి అనుమతించలేదు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ దాన్ని ప్రవేశపెట్టకుండా అడ్డుకుంది. ఏ సిఏజీని నిరంతరం జపిస్తూ ఉంటుందో, ఆ సీఏజీ తన నివేదికలో గుజరాత్‌లోఈ స్కీము అమలులో చోటుచేసుకున్న వివిధ ఆర్థిక అవకతవకలను సవివరంగా పేర్కొంది.

మోడీ బాటలోనే గుజరాత్ బీజేపీ మంత్రులు కూడా పీకల లోతు అవినీతిలో కూరుకు పోయారు. నీటి వనరుల మంత్రి పదవి నిర్వహించిన ఒక సీనియర్ మంత్రి బాబూ బొఖిరియాకు 2006 నాటి రూ. 54 కోట్ల సున్నపురాయి అక్రమ తవ్వకాల కేసులో ఇటీవలే పోర్‌బందర్ కోర్టు ఒకటి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కాంగ్రెస్ మాజీ ఎంపీ భరత్ ఒదేదర, గూండా భీమ దులా ఒదేదర మరియు అతడి కుమారుడు లక్షణ్ దులా ఒదేదర, పోర్‌బందర్ మార్కెటింగ్ యార్డు చైర్మన్‌లు కూడా ఆయనకు ఈ కేసులో సహఖైదీలు.

మత్స్య శాఖ మంత్రి పురుషోత్తమ్ సోలంకీ ఒక్కొక్కటి 200 హెక్టార్లకు పైగా ఉండే 50 రాష్ట్ర ప్రభుత్వ జలాశయాలలో టెండర్లు పిలవకుండానే చేపల వేట కాంట్రాక్టులను మంజూరు చేసి రాష్ట్ర ఖజానాకు రూ. 400 కోట్ల నష్టం కలిగించాడని కేసు దాఖలైంది.

సోలంకీ ఇంకా చాలా ఘనతలు మూటగట్టుకున్నాడు. అంతకు ముందు ముంబయి అల్లర్లలో ప్రమేయం ఉందని శ్రీకృష్ణ కమిషన్ నేరారోపణ చేసిన వారిలో ఆయన కూడా ఉన్నాడు. అంటే అవినీతి మతతత్వాల విషపూరిత కలయిక ఆయన చరిత్ర.

వీరిపై కేసులు నమోదయ్యాక కూడా మోడీ ఈ ఇద్దరినీ మంత్రివర్గంలో తనకు చేదోడుగా ఉంచుకున్నాడని చెప్పడం ఇక్కడ అసందర్భం కాకపోవచ్చు. ఇదీ మోడీ సుపరిపాలన!

గుజరాత్ ఖజానాకు వాటిల్లిన నష్టాలు, ఇక్కడ పేర్కొన్న లావాదేవీలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఆ మొత్తం లక్ష కోట్ల రూపాయలు దాటుతుంది. ఇది కూడా తక్కువలో తక్కువే. కాగ్ నివేదిక ప్రకారం, పారిశ్రామిక అభివృద్ధి సబ్సిడీల పేరిట పారిశ్రామిక అభివృద్ధి పేరిట ఒక్క 2012లోనే ఖజానా 16,000 కోట్ల రూపాయలు నష్టపోయింది.

ప్రధాని కావాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోడానికి వేలాది కోట్ల రూపాయలు మోడీ ప్రచారానికి ఖర్చు చేస్తున్నారు. ఈ డబ్బు ఎక్కడ నుంచి వస్తుందో తెలియడానికి పెద్ద ఊహాశక్తి ఏం అక్కర్లేదు.

## యూపీఏ బ్రాండ్ పరిపాలన : 2జీ స్కాములు, సీడబ్ల్యుజీ, ఆదర్శ్

ఈ మూడు స్కాముల ఫలితంగా ఖజానాకు 4 లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఏజీ–కాగ్) అంచనా ప్రకారం, 2జీ స్కాం ప్రభుత్వ ధనాగారానికి 1.76 లక్షల కోట్ల నష్టం కలిగించింది.

ఇది:

- 2014–15 విద్యా బడ్జెట్‌కు రెండు రెట్ల కంటే ఎక్కువ

- ఆరోగ్య బడ్జెట్‌కు దాదాపు అయిదు రెట్లు ఎక్కువ
- దళితుల సంక్షేమానికి వెచ్చించిన దానికి నాలుగు రెట్లు
- అదివాసీల సంక్షేమ కేటాయింపుల కంటే ఆరు రెట్లు అధికం

కొన్ని కార్పొరేట్‌ల ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు మార్చడం వల్ల ఈ మొత్తం ఖజానాకు దక్కలేదు. లైసెన్స్‌లు పారదర్శకత లేకుండా, ముందు వచ్చిన వారికి ముందు పద్ధతిలో పారదర్శకత లేకుండా జారీ అయ్యాయి. తేదీలు మార్చారు. కొన్ని కార్పొరేట్లకు ప్రయోజనం కలిగేలా రేట్లు నిర్ణయమయ్యాయి. ఈ అంశాలన్నీ సీపీఐ(ఎం) పార్లమెంటులో లేవనెత్తింది. దీంతో కాగ్ ఈ వ్యవహారంలోకి లోతుగా వెళ్ళి పరిశీలించింది. ఒక భారీ మోసాన్ని వెలుగులోకి తెచ్చింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, స్వాన్ టెలికామ్ లిమిటెడ్‌లకు అనుచిత ప్రయోజనాలు చేకూర్చినట్లు కాగ్ తన నివేదికలో ప్రస్తావించింది. మళ్ళీ రిలయన్స్!

ఇది కేవలం ఒక వ్యక్తి లేదా పార్టీకి సంబంధించిన ప్రశ్న కాదు. మొత్తం ప్రభుత్వం లాలూచీ పడింది. యూపీఏ క్యాబినెట్‌లో ప్రధాన మంత్రితో సహా కీలకమైన మంత్రులందరికీ ఏం జరుగుతోందో బాగా తెలుసు, నిజం చెప్పాలంటే ఈ సంఘటనలన్నింటికీ వారి ఆమోదం కూడా ఉంది.

**బొగ్గు బ్లాకుల స్కాం ఇలా :** బొగ్గు క్షేత్రాల కేటాయింపు పారదర్శకంగా జరగలేదని, వీటిని కేటాయింపు వల్ల కార్పొరేట్లు ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల ఆర్థిక లాభాలు మూటగట్టుకున్నాయి. బొగ్గు స్కాం చేసిన తీరిది: సహజ వనరు అయిన బొగ్గును జాతీయాకరణ విధానం నుంచి వెనుకంజ వేయడానికి ప్రయత్నం జరిగింది. బొగ్గు క్షేత్రాలను ప్రయివేటీకరించడానికి రకరకాల మార్గాలు అన్వేషించారు. వీటిలో ఒకటి, క్యాప్టివ్ మైన్స్ (ఒక పరిశ్రమ తన స్వంత ఉత్పత్తి అవసరాల కోసం గనులు కలిగిఉండటం) పేరిట గనులను కేటాయించడం. ఈ విషయంలో అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ ఉభయ పార్టీల

నేతలు క్యూ గట్టి మరీ మైనింగ్ అవసరమే లేని దానితో సంబంధమే లేని బోగస్ వ్యక్తులకు సంస్థలకు గనులు కట్టబెట్టాలంటూ సిఫారసులు చేశారు.

**కామన్‌వెల్త్ గేమ్స్ (సీడబ్ల్యూజీ)స్కాం,** ఆదర్శ్ సొసైటీ హౌసింగ్ స్కాం యూపీఏ నాయకుల ప్రమేయం ఉన్న మరో రెండు బడా స్కాములు. 2003లో సీడబ్ల్యుజీకి ఆతిథ్యం ఇచ్చే హక్కు ఇండియా సంపాదించింది. అప్పట్లో ఈ క్రీడల నిర్వహణకు రూ. 1,899 కోట్లు ఖర్చవుతాయని తొలుత అంచనా వేశారు. తీరా క్రీడలు జరిగిన తర్వాత అందుకైన వ్యయం రూ. 70,000 కోట్లుగా చూపించారు. అంటే అంచనా కంటే దాదాపు 37 రెట్లు అధికం. అంత క్రితం కామన్‌వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో నిర్వహించినప్పుడు అయిన వ్యయం కేవలం రూ. 5,200 కోట్లని మనం తెలుసుకున్నప్పుడు, మన దేశంలో ఎంత అవినీతి జరిగిందో ఎంత ప్రజాధనం వృధా అయ్యిందో అర్థం అవుతుంది.

**ఆదర్శ్ సొసైటీ** హౌసింగ్ స్కాం అవినీతికి మరో షోకేసు. ఈ స్కాములో అన్ని నియమాలు నిబంధనలు ఉల్లంఘించారు. కార్గిల్ వార్ మృతవీరుల వితంతువులకు, ఇతర యుద్ధాలలో పోరాడిన మాజీ సైనికులకు ఉద్దేశించిన ఈ సొసైటీలో వారికి మాత్రం ఒక్కటంటే ఒక్క ఫ్లాట్ కేటాయింపు జరగలేదు. బదులుగా అవినీతి రాజకీయ నేతలు, ఉన్నత స్థాయి బ్యూరోక్రాట్లు, సాయుధ దళాల్లో ఇంకా పెద్ద పదవులను అధిష్టించిన అధికారులు ఆ ఫ్లాట్స్‌ల్లో తిష్టవేశారు. ఈ సొసైటీలో ఒక్కో ఫ్లాట్ మార్కెట్ విలువ ఎనిమిది నుంచి పది కోట్లు ఉండగా వీరు కేవలం రు. 60–80 లక్షలకు పొందారు. ఇక వీటి నిర్మాణం పర్యావరణ అంశాలు, భవన నిబంధనలు అన్నీ ఉల్లంఘించి జరిగింది. అప్పట్లో మహారాష్ట్ర ముఖ్య మంత్రులుగా పనిచేసిన వారితో సహా అనేక మంది కాంగ్రెస్ నాయకులు వారితో జట్టు కట్టడానికి సిద్ధపడిన ఎన్‌సిపి, బీజేపీ, శివసేన నేతలతో కలిసి ఈ స్కాంలో ఉన్నారని ఆరోపణలు వచ్చాయి.

**ఐపీఎల్ :** నయా ఉదారవాద విధానాలకు సలాం! కాలక్షేపానికి, ఆరోగ్యానికి, సరదాకు ఒక మంచి అలవాటు అయినటువంటి క్రీడలు కూడా కాసులు కురిపించే

వృత్తులుగా మారిపోయాయి. క్రికెట్‌లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) రాకతో ఈ ధోరణి మున్నెన్నడూ లేని స్థాయిలకు చేరింది. చట్టవిరుద్ధమైన బెట్టింగ్‌లు, మ్యాచ్ ఫిక్సింగ్‌లు మైదానం మీద ప్రత్యక్షమయ్యాయి. బీసీసీఐ ఉన్నతాధికారులతో సహా ఎందరి ప్రమేయమో ఉన్న  వేలకోట్ల రూపాయలు ఇందులో ముడిపడి ఉన్నాయి. "క్రికెట్ పాలిటిక్స్"లో పీకల లోతు వరకూ కూరుకుపోయిన కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పుడు స్కాముల్లో సహచరులయ్యారు.

## తృణమూల్ కాంగ్రెస్, శారదా స్కాం : బెంగాల్‌లో అవినీతి

ఇవన్నీ యావత్ దేశాన్ని కుదిపేసిన ప్రధానమైన స్కాములు. ఇవే కాకుండా, అనేక రాష్ట్రాల్లో అనేక స్కాములు వెలుగు చూస్తూనే ఉన్నాయి. పేద ప్రజలు పైసాపైసాగా కూడబెట్టిన వందల కోట్ల రూపాయలను మింగేసి ఎందరి ఆత్మహత్యలకో కారణమైన పశ్చిమ బెంగాల్ శారదా చిట్‌ఫండ్ స్కాం వాటిలో ఒకటి. అక్కడి తృణమూల్ ప్రభుత్వం బాహాటంగా ఆ స్కాం పట్ల ఉపేక్ష వైఖరి అవలంబించింది. ఇందులో ప్రమేయం ఉన్న ఒక తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అరెస్ట్ అయ్యాడు. అతడు ఇంకా చాలా మంది నాయకుల పేర్లు బయటపెట్టాడు. ఈ కళంకిత కంపెనీని ప్రమోట్ చేయడంలో ముఖ్యమంత్రి  ప్రత్యక్ష ప్రమేయం ఉంది. టీఎంసీకి ఆ పార్టీ నాయకురాలికి ప్రచారం చేకూర్చిపెట్టడానికి ఈ చిట్ ఫండ్ కంపెనీ డబ్బుతోనే అనేక మీడియా కంపెనీలు ఏర్పాటు అయ్యాయి. ఈ కంపెనీకి లావాదేవీలున్న బీహార్, ఒరిస్సా, త్రిపుర, అస్సాం వంటి అనేక రాష్ట్రాలు సీబీఐ దర్యాప్తు కోరుతుండగా, బెంగాల్‌లో మాత్రం కప్పిపెట్టేందుకు తీవ్రస్థాయిలో కృషి జరుగుతోంది. సీబీఐ దర్యాప్తు వంటి చర్యలకు టీఎంసీ ప్రభుత్వం నిరాకరిస్తోంది. రెండేళ్ళు గడిచీ గడవక ముందే  పొరిబొర్తొన్ (పరివర్తన) ప్రభుత్వం స్కామ్‌లతో

కళంకితమైంది. అవినీతికి వ్యతిరేకంగా గత వామపక్ష ప్రభుత్వం నెలకొల్పిన ఆదర్శప్రాయమైన రికార్డుతో దీన్ని పోల్చిచూడాలి.

## కేరళలో సోలార్ స్కాం

కేరళలో సోలార్ స్కాం, సంబంధిత ఇతర స్కాములు కాంగ్రెస్ పార్టీ అవినీతిమయ రాజకీయాలను బట్టబయలు చేశాయి. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులుగా కాంగ్రెస్ నాయకులు పేర్కొనబడ్డారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ, జాతీయ రాష్ట్ర స్థాయిల్లోని నాయకత్వం ఈ కళంకిత నేతలను వెనకేసుకు రావడానికి సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

## మాటల్లో, చేతల్లో అవినీతికి వ్యతిరేకం సిపిఐ(ఎం)

మాటల్లో చేతల్లో అవినీతికి వ్యతిరేకించే ఒక రాజకీయ నిర్మాణానికి ప్రాతినిధ్యం వహించేది వామపక్షమే. ప్రజాజీవితంలో, రాజకీయాల్లో ప్రతి స్థాయిలో నిజాయితీ, పారదర్శకత... ఈ రెండు విలువల కోసం పోరాడింది వామపక్షమే.

అవినీతికి వ్యతిరేకంగా ఒక పటిష్టమైన చట్ట వ్యవస్థ (లీగల్ ఫ్రేమ్‌వర్క్)కు సిపిఐ(ఎం) మద్దతు ఇస్తుంది. ప్రయివేటు రంగాన్ని, కార్పొరేట్లను, అన్ని ప్రయివేట్-ప్రభుత్వ ప్రాజెక్టులను అవినీతి నిరోధక చట్టాల అజమాయిషీలోకి తీసుకురావడానికి మద్దతు ఇస్తుంది.

స్వతంత్ర లోక్‌పాల్ ఏర్పాటుకు సిపిఐ(ఎం) కట్టుబడి ఉంది. అయితే అంతటితోనే అవినీతిపై పోరాటం అంతం కాదు. అవినీతికి వ్యతిరేకంగా చట్టాలను అమలు పరచి, నేరస్తులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాజీవితాన్ని అవినీతి నుంచి విముక్తం చేసి తీరాలి. అదే సమయంలో మన దేశ వనరులను యధేచ్ఛగా లూటీ చేయడానికి

కార్పొరేట్లను అనుమతిస్తున్న ప్రస్తుత విధానాలను రద్దు చేసేందుకు జరుగుతున్న పోరాటాన్ని బలోపేతం చేసి తీరాలి.

అవినీతిపూరిత కార్పొరేట్ సంస్థలు, రాజకీయనాయకులు, ఉన్నతాధికారుల కలయికను విచ్ఛిన్నం చేసి తీరాలి.

సీపీఐ(ఎం) నాయకత్వంలో పాలించిన లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాలు నిజాయితీకి ప్రజానుకూల విధానాలకు ఒక ఉదాహరణ. నేడు అదే సంప్రదాయాన్ని నేడు త్రిపుర ప్రభుత్వం కొనసాగిస్తోంది.

**భారతదేశం భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది.**

## సిపిఐ(ఎం) కు ఓటేయండి.

## వామపక్షాన్ని బలపర్చండి.

## అవినీతి రహిత భారత దేశం నిర్మించండి.

వెల : ₹ 2/-

ప్రచురణ కర్త :

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తరపున
జె. జయరాం, హౌస్ నెం. 1-1-60/2, యం.బి.భవన్,
ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20